ప్రజాశక్తి
సోమవారం 26 జూన్ 2023 5 అనంతపురం

తేడా వస్తే ఆర్జీవీ తాటతీస్తాం

ఎపి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

అనంతపురం : సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ (ఆర్జీవీ) తీస్తున్న వ్యూహం సినిమాలో సోనియాగాంధీని తప్పుగా చూపిస్తే తాటతీస్తామని ఎపి పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు హెచ్చరించారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆదివారం అనంతపురం నగరానికి వచ్చిన ఆయన స్థానిక డిసిసి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వ్యూహం సినిమాపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందిస్తూ ఆర్జీవీ గురించి పట్టించుకోవాల్సిన పనిలేదని చెప్పారు. ఆయన ఎవరో ఒకరి జీవిత చరిత్రను ఇతివృత్తంగా తీసుకుని వివాదం తీసుకొచ్చి లబ్ధిపొందాలని చూస్తూనే ఉంటారన్నారు. మానిసిక స్థితి సరిగాలేని వ్యక్తి ఆర్జీవీ అని ఎద్దేవా చేశారు. వ్యూహం సినిమా కూడా ఇందులో భాగమేనని చెప్పారు. అందులో సోనియాగాంధీ గురించి తప్పుగా చూపిస్తే ఆయన తాటతీస్తామని హెచ్చరించారు. సోనియా అనుకుని ఉంటే ఆనాడే ప్రధానమంత్రి అయి ఉండేవారని చెప్పారు. అదే రకంగా రాహుల్‌గాంధీ కూడా అయి ఉండేవారని తెలిపారు. ఆర్జీవీకి అనవసరమైన ప్రచారాన్ని కల్పించవద్దని మీడియాకు సూచించారు.

క్షౌర వృత్తిని మింగేస్తున్న 'కార్పొరేట్'

పొట్టగొట్టొద్దంటున్న వృత్తిదారులు
'అనంత'లో ఆదివారం దుకాణాలు బంద్ చేసి నిరసన

నగరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న క్షౌరవృత్తిదారులు, నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

లాభముందనుకుంటున్న ప్రతి రంగంలోకి కార్పొరేట్ సంస్థలు చొచ్చుకుపోతున్నాయి. ఇందులో ఇప్పుడు క్షౌరవృత్తి చేరింది. బ్యూటీ స్పా కేంద్రాల పేరుతో రోజుకొకటి చొప్పున పుట్టుకొస్తున్న సంస్థల వల్ల తమ వృత్తికి నష్టం వాటిల్లుతుందంటూ అనంతపురం నగరంలో క్షౌరవృత్తిదారులు ఆందోళనబాటపట్టారు. ఆదివారం అనంతపురం నగరంలోని అన్ని సెలూన్ దుకాణాలను మూసి వేసి నిరసనకు దిగారు. కార్పొరేట్ సంస్థల నుంచి తమ వృత్తికి ముప్పు ఉందంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

'అనంత'లో పుట్టకొస్తున్న కార్పొరేట్ సంస్థలు

అనంతపురం నగరంలో ఒక్కటే రోజుకొకటి చొప్పున కార్పొరేట్ సెలూన్ కేంద్రాలు పుట్టకొస్తున్నాయి. పెద్దఎత్తున పెట్టుబడులతో ఆకర్షణీయంగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటి వరకు చూస్తే దేశంలో ప్రముఖ కంపెనీలుగానున్న జావిద్ హబీబ్, నేచురల్స్, గ్రీన్ ట్రెండ్స్, లోరల్, లాక్మీ వంటితోపాటు కలిపి మొత్తం పదికిపైగా సెలూన్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. వీటి పరిధిలో దాదాపు 200 మంది వరకు పనిచేస్తున్నారు. వీటన్నింటిలోనూ కలిపి రోజుకు రెండు లక్షల రూపాయల వరకు వ్యాపారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మరిన్ని సంస్థల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి. ఈ మేరకు నెలకు రూ.20 లక్షలకుపైగా వ్యాపారం ఈ సంస్థల పరిధిలోనే జరుగుతోంది. దీంతో స్థానికంగా ఉన్న క్షౌరవృత్తిదారుల దుకాణాలపై వీటి ప్రభావం పడుతోంది.

వేలాది మంది ఉపాధిపై ప్రభావం

కార్పొరేట్ సంస్థలు విస్తరిస్తున్న కొద్దీ అనంతపురం నగరంలో ముందు నుంచి ఈ వృత్తి ఆధారపడి జీవిస్తున్న క్షౌరవృత్తిదారుల ఉపాధికి గండం పడుతోంది. తరతరాలుగా ఇదే వృత్తిని కులవృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ రకంగా ఒక్క అనంతపురం నగరంలోనే 870 సెలూన్ షాపులున్నాయి. వీటిల్లో 2500 మంది వరకు పనిచేస్తున్నారు. ఇందులో అత్యధికమంది గ్రామీణ ప్రాంతాల నుంచి వలసొచ్చి జీవిస్తున్న వారే. గ్రామాల్లో తగినంత ఉపాధి లేకపోవడంతో నగరాలకు వలసొచ్చి నగరంలో ఉంటున్నారు. ఇప్పుడు ఈవృత్తి ఇక్కడ కూడా దెబ్బతింటే తాము ఏమి చేసి బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా కొత్తగా ఏర్పాటవుతున్న కంపెనీల్లో నాయి బ్రహ్మణులే కాకుండా ఇతర కులాల వారూ ఉంటున్నారు. దీంతో ఈ వృత్తినే కులవృత్తిగా నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమ పరిస్థితి ఏమిటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'అనంత'లో క్షౌర శాలలు బంద్

కార్పొరేట్ సంస్థల నుంచి తమ వృత్తికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ నాయి బ్రహ్మణ సేవా సంఘం (యువజన) ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఉదయం నుంచి క్షౌరశాలలను మూసివేశారు. ఉదయం నగరంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. సప్తగిరి సర్కిల్ వద్ద నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడే నిరసన ప్రదర్శన చేశారు. క్షౌరవృత్తిపై తరతరాలుగా ఆధారపడి జీవిస్తున్న తమకు కార్పొరేట్ సంస్థల నుంచి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు పెనకచెర్ల చంద్రశేఖర్, సలహాదారులు ఎం.శ్రీనివాసులు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం నగరంలో మూతపడిన సెలూన్ దుకాణం

కులవృత్తినే నమ్ముకున్న వారికి ఉపాధి లేకుండాపోతోంది

మాకు క్షౌరవృత్తి కులవృత్తిగా ఉంది. తరతరాలుగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. ఇప్పుడు రోజుకొక కార్పొరేట్ కంపెనీ నగరంలో పుట్టకొస్తోంది. అందులో ఇతర కులాలు, మతాల వాళ్లు కూడా పనిచేస్తున్నారు. దీంతో ఈ రంగంపై ఆధారపడి పనిచేస్తున్న నాయిబ్రహ్మణుల వృత్తికి దెబ్బపడుతోంది. ఈ కార్పొరేట్ కంపెనీల వల్ల జరిగే నష్టం నుంచి మాకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం.

పెనకచెర్ల చంద్రశేఖర్,
అధ్యక్షులు,
నాయి బ్రహ్మణ యువజన సంఘం అనంతపురం.

కరపత్రాలు విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ ఛార్జీల పెంపుతో పేదల నడ్డి విరుస్తున్న ప్రభుత్వాలు

సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య

ప్రజాశక్తి-శింగనమల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచ్చలవిడిగా విద్యుత్ ఛార్జీలు పెంచుతూ పేదలు, రైతుల నడ్డి విరుస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.బాలరంగయ్య విమర్శించారు. ఆదివారం మండలం పరిధిలోని సలకంచెరువు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో ముద్రించిన 'కరెంటు బిల్లులతో జనానికి షాక్' అనే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కళ్లు కప్పి దొడ్డిదారిన సర్దుబాటు పేరుతో అదనపు ఛార్జీలు వేస్తూ కార్పొరేట్ల జేబులు నింపుతున్నాయన్నారు. ఇప్పటి వరకు రెండేళ్లకో.. మూడేళ్లకో కరెంటు ఛార్జీలు పెంచేవారని, అయితే మోడీ ప్రభుత్వం ఆదేశాలకు తలొగ్గిన సిఎం జగన్ ప్రభుత్వం ప్రతినెలా వంటగ్యాస్ లాగానే కరెంటు ఛార్జీలను కూడా పెంచేందుకు ఆదేశాలు ఇచ్చారన్నారు. కరెంటుకు బిల్లులే కాకుండా ఫిక్స్, కస్టమర్, సర్, సర్దుబాటు ఛార్జీలు, విద్యుత్ సుంకం అంటూ రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారన్నారు. అసలు ఛార్జీల కంటే కొసరు ఛార్జీలే ఎక్కువ అయ్యాయన్నారు. రాజకీయ అవినీతిపరులు, కార్పొరేట్ పాలకులు కుమ్మక్కై రూ.2, రూ.3కు కొనాల్సి విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.20కి కొంటున్నారన్నారు. ఇందులో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకుంటున్నా ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా హిందుజా సంస్థకు రూ.1200 కోట్లు చెల్లించడం బాధాకరమన్నారు. దీనికితోడు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించి విద్యుత్ ఛార్జీలు వసూలు చేసేందుకు ఎసరు పెట్టేందుకు యత్నిస్తున్నారన్నారు. 200 యూనిట్లలోపు వాడే వారందరికీ ఉచిత విద్యుత్ ఇస్తామని మాట చెప్పి జగన్ మోసం చేశారన్నారు. మీటర్లు ఏర్పాట చేసేందుకు అదానీ కంపెనీకి కాంట్రాక్టు ఇస్తున్నారన్నారు. మీటర్లు బిగించిన తర్వాత ఏ గంటకు ఎంత కరెంటు వాడేమో తెలుస్తుందన్నారు. భవిష్యత్‌లో డిమాండ్‌ను బట్టి గంట గంటకూ ఒక్కో రేటు నిర్ణయించే ప్రమాదం ఉందన్నారు. రాత్రిపూట ఎక్కువ రేటు ఉండే ప్రమాదం పొంచి ఉందన్నారు. అందుకే స్మార్ట్ మీటర్లు కొంపముంచేందుకు రెడీ అవుతున్నాయన్నారు. అందుకే వీటిని ఆదిలోనే తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. వీటిపై రానున్న రోజుల్లో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్, నాయకులు సుంకన్న, లక్ష్మీనారాయణరెడ్డి, ఓబిరెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసులు, మేకల పెద్దన్న, పుల్లన్న, రామాంజనేయులు, వెంకటనారాయణ, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, నాగరాజు, చెంగల్ ధనుంజయ, వెంకటనారాయణ, రాముడు, కుళ్లాయిస్వామి, గంపన్న, పెద్ద ఆంజనేయులు, అప్పరాజు, దొడ్ల అయ్యప్ప, రామదాసు, రాముడు, కొండమ్మ పాల్గొన్నారు.

ఇళ్లనిర్మాణాలపై లబ్ధిదారులతో చర్చిస్తున్న కలెక్టర్ గౌతమి

మహిళా సాధికారితే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-గార్లదిన్నె

మహిళల ఆర్థికాభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ గౌతమి తెలిపారు. మండల కేంద్రంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరై పూర్తయిన ఇళ్లను ఎంపి తలారి రంగయ్యతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా, సామాజికంగా గౌరవం పెంచేందుకే మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు మంజూరు చేసి నిర్మాణాలు చేపట్టామన్నారు. ఇప్పటివరకు జగనన్న కాలనీలో 50 శాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన వాటిని కూడా త్వరలో పూరి చేస్తామన్నారు. ఇళ్ల నిర్మాణాలకు ఆర్థిక స్థోమత లేకపోయినా వాటికి బ్యాంకుల ద్వారా, స్వయం సహాయక సంఘాల శ్రీనిధి, ముద్రా రుణాలు ఇప్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే రోడ్లు, విద్యుత్తు, డ్రెయినేజీ వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు పూర్తి చేసిన వారిని ఆదర్శంగా తీసుకుని పూర్తి చేయాలన్నారు. ఎంపి తలారి రంగయ్య మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ఇల్ల నిర్మాణాలను చేపట్టిందన్నారు. కావున ప్రజలందరూ దీన్ని దృష్టిలో పెట్టుకుని మరొకసారి జగనన్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చెన్నకేశవనాయుడు, ఎంపిపి వెంకటనారాయణ, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ నారాయణరెడ్డి, వైస్ ఎంపిపి రామ్మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, తహశీల్దార్ ఉషారాణి, ఎంపిడిఓ తేజష్ణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

వలసల నివారణే లక్ష్యం

జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పనులు కల్పించి వలసలు నివారించడమే తమ ప్రథమ కర్తవమని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామాంజనేయులు పేర్కొన్నారు. ప్రభుత్వం కూలీలకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తుందని అందుకోసం జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకాలు, నీటి సంరక్షణ పనులు, ల్యాండ్ లెవెలింగ్ తదితర పనులు చేపడుతోందని చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెలిబుచ్చారు.

ప్రశ్న: ఈ ఏడాది కూలీలకు పనులు కల్పించడానికి ఎలాంటి ప్రణాళికను తీసుకుంటున్నారు ?

జవాబు : జూలై నెల నుండి క్షేత్రస్థాయిలో సిబ్బందిని సుమయాత్తం చేస్తున్నాం. రోజు జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి పైగా పనులు కల్పించే విధంగా చర్యలు చేపడుతున్నాం. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు పనులు కల్పించి వలసలు నివారించడమే ప్రథమ లక్ష్యం. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి కావలసిన పనుల గుర్తింపు కార్యక్రమం క్షేత్రస్థాయిలో జరుగుతోంది. జియోగ్రాఫిక్ ఇన్సులేషన్ సిస్టం ద్వారా నీటి సంరక్షణ పనులు, ఉమ్మడి ఆస్తుల పునరుద్ధరణ, వ్యక్తిగత పనులను గుర్తించి అంచనాల తయారుచేసి పరిపాలన అనుమతులు తీసుకుని కూలీలకు పనులు కల్పిస్తాం.

ప్ర: జిల్లా నీటి యజమాన్య సంస్థ ఆధ్వర్యంలో ఏయే పనులు చేపడుతున్నారు ?

జ : ప్రస్తుతం శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా పండ్ల తోటల పెంపకం, చెత్తతో సంపద సృష్టించే కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వాటితో పాటు కొత్త పనులను గుర్తించి ఉపాధి కల్పించడమే ప్రథమ కర్తవ్యంగా కృషి చేస్తున్నాం. పండ్ల తోటలు పెంపకం ద్వారా రైతులకు ఎంతో లబ్ధి చేకూరుస్తున్నామని చాలా మంది రైతులు పండ్ల తోటలు సాగుకు మక్కువ చూపుతున్నారు.

ప్ర: డిఆర్‌డిఎ సమన్వయంతో మునగ ప్లాంటేషన్ ఎంతమందికి ఇస్తున్నారు ?

జ : శ్రీ సత్య సాయి జిల్లాలో డిఆర్‌డిఎ సమన్వయంతో పొదుపు సంఘాల సహకారంతో జిల్లా వ్యాప్తంగా నర్సరీలు ఏర్పాటుకు నివేదికలు తయారు చేశాం. ఆయా గ్రామాల్లో పొదుపు సంఘాల సభ్యుల ద్వారా ఇంటింటికి ఐదు మునగ మొక్కలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. మొక్కలు పెంచడానికి నర్సరీలు గుర్తించి వాటిలో మొక్కలు పెంచి అందజేసి ప్రజలకు లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు చేపడుతున్నాం. ప్రజలు ఇళ్లవద్ద తోటల ల్లో, గడ్డివాముల వద్ద పెంచుకొని వాటి నుండి లబ్ధి చేకూరి విధంగా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల రైతులకు ఎంతో ఉపయోగం.

ప్రశ్న: ఉపాధి బిల్లులు చెల్లింపు విషయంలో జాప్యం ఎందుకు జరుగుతోంది ?

జ : ఉపాధి కూలీల బిల్లులు చెల్లింపు విషయంలో కొంత జాప్యం జరుగుతున్న విషయం వాస్తవమే. కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద బిల్లులు మంజూరు చేయాల్సి ఉండడంతో ఈ జాప్యం జరిగింది. ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం చేపట్టిన రైతులకు బిల్లులు ఉపాధి హామీ కూలీలకు చెల్లించే బిల్లులు నెలనెలా చెల్లించడానికికసరస్తు చేస్తున్నాం .అదేవిధంగా కొత్త పనులను గుర్తించి కూలీలకు ఉపాధి కల్పించనున్నాం. పని దినాలను పెంచేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేశాం. వర్షాకాలం ఆసన్నమైనందున ఉపాధి కూలీలు వ్యవసాయ పనులకు వెలుతున్న తరుణంలో కొత్త పనులను గుర్తించడానికి చర్యలు చేపడుతున్నాం.

పీడీ రామాంజనేయులు

నేతన్న నేస్తంలో 'రాజకీయం'

'కులం చూడం, మతం చూడం, పార్టీలు చూడం, రాజకీయాలు చేయం, అర్హత ఉంటే చాలు ఎవరి ప్రమేయం ఎటువంటి సిఫారసులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు డబ్బు జమ చేస్తా'మని స్వయాన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పదేపదే చెప్పే మాటలు. అయితే క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి మాటలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అడ్డమైన నిబంధనలు విధిస్తూ రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతూ ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామాలలో అలజడి సృష్టించడానికి కుట్రలు పన్నుతున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. అర్హత కలిగిన లబ్ధిదారులను గుర్తించి వారికి పథకాలు అందజేయాల్సిన అధికారులే స్థానిక ప్రజాప్రతినిధి ఒత్తిళ్లకు తలొగ్గి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణాలు వ్యక్తం అవుతున్నాయి.

స్థానిక ప్రజాప్రతినిధి ఒత్తిళ్లతో అధికారులు మౌనం
వెల్ఫేర్ అసిస్టెంట్ నిర్లక్ష్యం
గడువు ముగియడంతో నేత కార్మికులు లబోదిబో

ప్రజాశక్తి కదిరి టౌన్

రెక్కాడితే గాని డొక్కాడని నేతకార్మికుల కష్టాలు వర్ణణాతీతం. అప్పుల ఊబిలోకి వెళుతున్న నేతకార్మికులను ఆదుకోవాలన్న సంకల్పంతో సీఎం జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. సొంతం మగ్గం కలిగిన వారికి ప్రతి ఏటా 24 వేల రూపాయలు నేరుగా వారి ఖాతాలకు జమ చేస్తున్నారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధి వ్యవహారశైలి పలువురు నేతకార్మికులకు నష్టం చేకూర్చుతోందన్న విమర్శలున్నాయి. మూడు సంవత్సరాలు వరుసగా అర్హత సాధించిన కార్మికులకు ఈ ఏడాది సొంత మగ్గం కలిగి ఉన్నప్పటికీ అర్హత జాబితాలో పేరు చేర్చేందుకు అధికారులు సచివాలయ సిబ్బంది వెనకడుగు వేస్తున్నారు. బాధిత నేతకార్మికులు పది రోజుల నుండి సచివాలయం, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా ఫలితం కన్పించడం లేదు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ నేతన్న నేస్తం అర్హత జాబితాలో ఎందుకు తమను చేర్చలేదని కార్మికులు ప్రశ్నిస్తే వెల్ఫేర్ అసిస్టెంట్ నిర్లక్ష్యమైన సమాధానం చెబుతూ అర్హత గడువు ముగిసేవరకు కాలయాపన చేస్తున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. 'ఎంపీటీసీ ఆదేశిస్తే అర్హత జాబితాలో చేరుస్తామని లేకుంటే లేద'ని వెల్ఫేర్ అసిస్టెంట్ తెగేసి చెబుతున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం గడువు ముగియడంతో నేత కార్మికులు ఏం చేయాలో దిక్కుతోచక ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. నల్లచెరువు మండలం కదిరిపులకుంట గ్రామానికి చెందిన జహీర్, శ్రీనివాసులు గత పది సంవత్సరాలుగా నేత కార్మికులుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మగ్గం నేస్తేనే పూట గడవని కుటుంబాలు వారివి. ప్రభుత్వం నుండి ఆర్థికసాయం అందుతున్న ఆశతో ఉన్న వారికి స్థానిక ప్రజాప్రతినిధి, అధికారుల వ్యవహరించిన తీరుతో నిరాశ ఎదురైంది. అర్హత కలిగిన నేతకార్మికులకు ప్రభుత్వ సాయం అందే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ నిర్లక్ష్యం : ప్రభుత్వం నుండి వేలాది రూపాయలు జీతభత్యాలు తీసుకుంటూ బాధ్యతగా విధులు నిర్వర్తించాల్సిన వెల్ఫేర్ అసిస్టెంట్ అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులు వత్తుతూ వారు చెప్పిన వారికే ప్రాధాన్యతనిస్తూ అంతులేనీ నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారనికదిరి పూలకుంట గ్రామపంచాయతీ ప్రజలు ఆరోపిస్తున్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేసి వారికి భరోసా ఇవ్వాల్సిన వెల్ఫేర్ అసిస్టెంట్ విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శిస్తున్నారు. బాధిత నేతకార్మికులు గత పది రోజులుగా వెల్ఫేర్ అసిస్టెంట్ చుట్టూ తిరుగుతున్న కనికరించలేదు. ఉద్దేశ పూర్వకంగా సెల్ స్విచ్ఆఫ్ చేసుకుంటూ నానా ఇబ్బందులు గురి చేశారని బాధితులు వాపోతున్నారు. సంబందిత అధికారులు వెల్ఫేర్ అసిస్టెంట్ తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మితిమీరిన స్థానిక ప్రజాప్రతినిధి జోక్యం : ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రజా ప్రతినిధి తనకు అనుకూలమైన రాజకీయాలు చేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. తన ప్రమేయం లేకుండా పథకాలు వర్తింపజేస్తే చర్యలు తప్పవని సచివాలయ సిబ్బందిని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో సచివాలయ సిబ్బంది లబ్ధిదారులు సచివాలయానికి వచ్చిన వారికి 'ఆ ప్రజాప్రతినిధి నుండి ఫోన్ చేయిస్తే పథకాలు వస్తాయని లేకుంటే రావ'ని కరాఖండిగా చెబుతున్నారని బాధితులు విమర్శిస్తున్నారు.

అర్హత ఉన్నా అన్యాయం చేస్తున్నారు

మూడు సంవత్సరాలుగా వరుసగా నేతన్న నేస్తం పథకం కింద డబ్బులు వచ్చాయి. అయితే ఈ ఏడాది ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి తనకు నేతన్న నేస్తం రాకుండా అడ్డు తగులుతున్నాడు. రాజకీయ కక్షతోనే ఎంపీటీసీ ఈ విధంగా వ్యవహరిస్తున్నాడు. వెల్ఫేర్ అసిస్టెంట్ వద్దకు వెళితే ఎంపీటీసీ చెబితేనే నమోదు చేస్తానని లేకుంటే నేనేం చేయలేనని చెబుతున్నాడు.

జహీర్,
నేతకార్మికుడు నల్లచెరువు మండలం

స్థానిక ప్రజాప్రతినిధి ప్రోద్బలంతో అన్యాయం

స్థానిక ఎంపీటీసీ ప్రోద్బలంతో నాకు నేతన్ననేస్తం అందలేదు. అర్హత ఉన్నప్పటికీ నా పేరును నమోదు చేయలేదు. మూడు సంవత్సరాలుగా నేతన్న నేస్తం వస్తోంది. ఆసారిమాత్రం పేరు లేదు. పది రోజులుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్న ప్రయోజనం కన్పించలేదు.

శ్రీనివాసులు,
నేతకార్మికుడు నల్లచెరువు మండలం

బొమ్మనహాల్‌లో నీటి ఎద్దడి

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల కేంద్రంలో మూడు రోజుల నుంచి తాగునీటి కటకట ఏర్పడింది. మండలానికి సరఫరా అయ్యే తాగునీటి పైప్‌లైన్లకు సంబంధించిన మోటార్లు కాలిపోవడం పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడురోజులు కావొస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు లబోదిబోమంటున్నారు. మండలానికి రెండు మార్గాల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. ఆ రెండు మార్గాల్లో కూడా విద్యుత్ మోటార్లు కాలిపోయాయి. దీంతో తాగునీటి సమస్య తీవ్రమైంది. ఆయా మోటార్లను మరమ్మతులు చేయాలంటే కనీసం రెండు రోజుల సమయం పడుతుందని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. దీంతో చేసేదిలేక మండల ప్రజలు వ్యవసాయ మోటార్లకు ఆశ్రయించాల్సి వస్తోంది. అదికూడా మోటార్లకు విద్యుత్ సరఫరా ఉన్నప్పుడు మాత్రమే నీటిని తెచ్చుకోవాలి. దీంతో పనులు మానుకోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయంపై ఎంపిడిఒ షకీలాబేగంను వివరణ కోరగా వీలైనంత త్వరగా విద్యుత్ మోటార్లకు మరమ్మతులు చేసి తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మండలంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి కోసం బోరుబావి వద్దకు వెళ్తున్న మహిళ

ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

కలెక్టర్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండల కేంద్రంలో అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకుని అక్రమంగా ప్లాట్ వేయడానికి సిద్ధం చేసిన భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మండల పర్యటనకు వచ్చిన కలెక్టర్ గౌతమిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 456లో 6-10 ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకులు ఆక్రమించుకున్నారన్నారు. ఈ విషయమై సిపిఎం ఆధ్వర్యంలో మూడు నెలలుగా అన్నిఆధారాలతో తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఎన్నిసార్లు విన్నవించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు కబ్జాదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం అధ్యక్షుడు నాగరాజు, మిద్దె నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

అమరావతినే రాజధానిగా కొనసాగించాలి

కమ్మ సేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు

ప్రజాశక్తి-గుత్తి

అన్ని హంగులూ ఉన్న అమరావతిలోనే రాజధాని ఏర్పాటు చేయాలని కమ్మ సేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట్రావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న శ్రీనివాస్ ఫంక్షన్ హాల్‌లో గుత్తి కమ్మ సేవాసంఘం ఆధ్వర్యంలో కమ్మవారి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్, దివంగత టిడిపి నాయకులు కెసి.నారాయణకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ సంఘంలోని పేదలకు విద్య, వైద్యం కోసం ఆర్థికసాయం చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మ సేవాసంఘం రాష్ట్ర ఉపాధ్యకులు కె.ఉమాపతినాయుడు, ఎం.బోసుబాబు, కోశాధికారులు అయోధ్య రామయ్య, కెసి.హరి, కార్యదర్శి వెలగ కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులు తమ్మినేని రమేష్‌బాబు, పరుచూరి శ్రీనివాస్‌రావు, కర్నూలు అధ్యక్షులు డాక్టర్ కృష్ణమోహన్, నంద్యాల అధ్యక్షులు డి.వెంకట రమణ, ఆలూరు వైకుంఠ మల్లికార్జునచౌదరి, డోన్ ఉన్నం వెంకటకృష్ణారెడ్డి, డోన్ కార్యదర్శి పోలూరి రాఘవరెడ్డి, గుత్తి కమ్మ సంఘం అధ్యక్షులు గోరంట్ల నాగరాజు, పామిడి అధ్యక్షులు బండారు రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కమ్మసంఘం నాయకులు

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ఎంపిడిఒ నిర్మల కుమారి

ప్రజాశక్తి-శింగనమల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఎంపిడిఒ నిర్మలాకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వచ్చేనెల 1 నుంచి 25వ తేదీ వరకూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాలను సందర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు. 1న ఆకులేడు, 2, 4న పెరవలి, 6న జూలాకాలువ, 7న బండమీద పల్లి, 13న ఉల్లికల్లు, 11న సోదనపల్లి, 14న వెస్టు నరసాపురం, 15న సలకంచెరువు, 18న శింగన మల, 20న కల్లుమడి, 22న తరిమెల, 25న రాచేప ల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లి 11 రకాల సేవలను ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ఆయా తేదీల్లో ఆయా గ్రామాల్లో దండోరా వేయించి ప్రజలకు సమాచారం అందజేయనున్నట్లు తెలిపారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

జెవివి రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రంగన్న

ప్రజాశక్తి-గుత్తి

ప్రతి ఒక్కరూ శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు డాక్టర్ ఎం.రంగన్న సచించారు. ఆదివారం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద జెవివి మండల కమిటీ ఆధ్వర్యంలో జెవివి సభ్యత్వానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర ప్రచారంలో ప్రజలను చైతన్య పరచడానికి జెవివి 35 ఏళ్లుగా కృషి చేస్తోందన్నారు. శాస్త్రీయ సమ నిర్మాణం కోసం ప్రజలు సైన్స్ ఫలాలు పొందాలన్నారు. ప్రజలందరూ జెవివిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు గురుశంకర్, దేశాయి నాగరాజు, మండల నాయకులు ఖలీల్,ఆదినారాయణ, మాబు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న జెవివి నాయకులు

చైతన్య రథయాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

భవిష్యత్‌కు భరోసా పేరుతో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్య రథయాత్రను జయప్రదం చేయాలని టిడిపి టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరామ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాదినేని ఉమామహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను ప్రజలందరికీ వివరించేందుకు యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఈ యాత్ర మంగళవారం కళ్యాణదుర్గంలోని టిసర్కిల్‌కు చేరుకుంటుందన్నారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొనిజయప్రదం చేయాలని కోరారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

30న విజయవాడలో మహాధర్నా - ఎపి రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ఈనెల 30న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నా జయప్రదం చేయాలని జిల్లా రాష్ట్ర నాయకురాలు సావిత్రి, ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈమేరకు ఆదివారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడిన రాయలసీమ జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అనంతపురం జిల్లాకు ఎగువన నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టు అనుమతులు రద్దుచేయాలని, 2022 ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా విడుదల చేయాలని, వ్యవసాయ పెట్టుబడులు పెరిగిపోయినందున 0 వడ్డీ పథకం రూ.2 లక్షలకు, పావలా వడ్డీ పథకం ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు కనీసం పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. ఈ ధరలకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 20 శాతం బోనస్‌గా ఇవ్వాలని కోరారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాని డిమాండ్ చేశారు. అలాగే ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని, డ్రిప్, స్ప్రింకర్లకు జీఎస్టీ రద్దు చేసి ప్రతి రైతుకు 90శాతం సబ్సిడీతో ఇవ్వాలని తెలిపారు. గ్రామసభల ద్వారా జిల్లాలో కౌలు రైతులందరినీ గుర్తించి గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ ఈనెల 30న విజయవాడలో జరిగే మహాధర్నాను జిల్లా రైతులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు శివశంకర్, రామయ్య, రాజేశ్వరి, జయమ్మ, నాగసుధ, శ్రీదేవి, ఉమా, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను విడుదల చేస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రభుత్వ విద్యను కాపాడుకుందాం

మహాత్మా పూలే ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పోతుల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వ విద్యను కాపాడుకోవాల్సిన బాధ్యత, అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మహాత్మా పూలే ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పోతుల నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని నక్కా రామారావు యాదవ్ ఫంక్షన్ హాల్‌లో రాయలసీమ వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదువుతూ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్‌పిఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి యక్కలూరు పుల్లయ్య అధ్యక్షతన పూలే అంబేద్కర్ ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రానున్న రోజుల్లో కూడా అత్యున్నత ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలలు, కళాశాలలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అంతేగాకుండా భవిష్యత్తులో సమాజానికి మెరుగైన సేవలు చేయాలని పిలుపునిచ్చారు. మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వంటి మహనీయులు దేశంలోని పేదల కోసం నిరంతరం పోరాటం చేశారు. అదేవిధంగా బాలికల విద్య కోసం ఎంతో కృషి చేశారు. వారి అడుగుజాడల్లో నడిచి దేశ అభివృద్ధి నడుం బిగిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య, బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి, పీపుల్స్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ నర్సింహమూర్తి, రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగభూషణం, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, ఆర్‌పిఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విఠల్‌గౌడ్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లింగమయ్య, ఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు డోన్ శంకర్, బహుజన విద్యార్థి సంఘం నాయకులు శివకృష్ణ యాదవ్, సురేష్‌యాదవ్ పాల్గొన్నారు.

పురస్కారాలు తీసుకుంటున్న విద్యార్థులతో మహాత్మా పూలే ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పోతుల నాగరాజు

అర్హులందరికీ మెరుగైన సేవలు

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో ప్రజల జీవన స్థితిగతులపై అత్యంత శ్రద్ధ తీసుకుని అర్హులందరికీ మెరుగైన సేవలు అందించాలన్న ఉద్దేశంతోనే సిఎం జగన్ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ నాలుగేళ్లపాటు జనరంజక పాలన అందించడంతో పాటు మరోసారి ప్రజల్లోకి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే 99 శాతం సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించారన్నారు. ఆ ఒక్క శాతం మందికి కూడా సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 85 శాతం పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ప్రజల వినతులు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రజలు అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగే పరిస్థితిని దూరం చేయటంతోపాటు, దళారీ వ్యవస్థకు ఈ కార్యక్రమం ద్వారా చెక్ పెట్టారని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో 11 రకాల సేవలు ప్రజలకు ఉచితంగా అందించేందుకు చర్యలు చేపట్టారన్నారు. నియోజకవర్గంలో గడిచిన నాలుగేళ్లలో వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు దాదాపు రూ.3 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. ఇందులో రూ.100 కోట్లు ఒక్క బీమా పథకానికే పెట్టామన్నారు. గడప గడపకూలో భాగంగా అత్యవసర పనుల కోసం మరో రూ.14 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆయా పథకాలు, అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, ఉరవకొండ, కూడేరు ఎంపిపిలు చంద్రమ్మ, నారాయణరెడ్డి, ఉరవకొండ, విడపనకల్లు జెడ్పిటిసిలు పార్వతమ్మ, హనుమంతు, వైస్ ఎంపిపి నరసింహులు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్, నాయకులు బసన్న, భీమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

అప్పిరెడ్డి హరినాథరెడ్డికి నాటా సాహితీ పురస్కారం

30న డల్లాస్‌లో అవార్డు ప్రదానం

అనంతపురం : సాహిత్య పరి శోధకులు, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత డా.అప్పిరెడ్డి హరినాథరెడ్డికి అమెరికాలోని ప్రతిష్టాత్మక తెలుగు సంస్థ నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (నాటా) సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది. ఈమేరకు జూన్ 30న డల్లాస్ నగరంలో జరిగే నాటా మహాసభల ప్రారంభ సభలో అప్పిరెడ్డి అవార్డును అందుకోనున్నారు. రాయలసీమ ప్రాంత సాహిత్యం వెలుగులోకి తీసుకురావడం, సాహిత్య పరిశోధన విమర్శ రంగాల్లో కషి చేయడం, వేమన సాహిత్యం, తెలుగుభాషా కార్యక్రమాలు విస్తరణ తదితర అంశాల ప్రాతిపదికగా హరినాథరెడ్డికి నాటా పురస్కారం లభించినట్లు తెలిసింది.

గ్రంథాలయం తనిఖీ

బహ్మసముద్రం : మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి రమాదేవి ఆదివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సందర్శకుల రిజిస్టర్, గ్రంథాలయ పాఠకుల వైపు అత్యధిక దృష్టి సారించాలన్నారు. రికార్డుల నిర్వహించిన తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నూతన గ్రంథాలయ ఏర్పాటుకు త్వరలోనే కృషి చేస్తామన్నారు వర్షాకాలం సమీపిస్తుండడంతో గ్రంథాలయ శాఖ వచ్చే పాఠకులు జాగ్రత్త తప్పనిసరి వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి అధికారి ఎర్రిస్వామి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు

రికార్డును పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమాదేవి

సర్ థామస్ మన్రో సమాధిని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

గుత్తి కోటను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్

గుత్తి : చారిత్రాత్మక గుత్తి కోటను జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు గుత్తి కోట సంరక్షణ సమితి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఇందులో భాగంగా కోటలోని చరిత్ర ఉన్న కట్టడాలను వీక్షించారు. ముందుగా జిల్లా మొట్టమొదటి కలెక్టర్ సర్ థామస్ మన్రో సమాధిని సందర్శించారు. అనంతరం కోటలోని కట్టడాలను చూశారు. గుత్తి కోట చరిత్ర, కట్టడాలు, దేవాలయాల విశిష్టత గురించి నాయకులు అసిస్టెంట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు సి.విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు కరిడికొండ సుధాకర్‌నాయుడు, యువజన సమితి కన్వీనర్లు చిరంజీవి, హెచ్‌ఎం.జిలాన్, హెచ్‌ఎం అర్షద్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే ఎంబిసిలకు గుర్తింపు

ఉరవకొండ : ఎంబిసిలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాలంటే ఒక్క టిడిపితోనే సాధ్యమని బుడబుక్కల ఎంబిసి రాష్ట్ర సాధికారిక సభ్యులు బి.గోపాల్ తెలిపారు. ఆదివారం ఉరవకొండలో ఎంబిసి పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆదేశాలతో పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే సంచార జాతుల స్థితిగతులు మారిపోతాయన్నారు కావున రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకుని చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబిసి రాష్ట్ర కన్వీనర్ పెంద్ర రమేష్, టిడిపి అనంతపురం పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగరాజు, మండల కన్వీనర్ గోవిందు, జిల్లా అధ్యక్షులు నాయకల్ రాము, నాయకులు అంజి, హనుమంతు, మల్లారెడ్డి, ఓబుళరెడ్డి, కిట్టు, ఉలిగప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోరుబాటలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సహకార సంఘాల ప్రయివేటీకరణ ఆపాల్సిందే..

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సహకార సంఘాల ప్రయివేటీకరణ తక్షణమే ఆపాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో విలీనం చేయడాన్ని అపాలన్నారు. 36 జిఒ ప్రకారం పెరిగిన వేతనాలు 2019 నుంచి అమలు చేయాలన్నారు. జగన్ ప్రభుత్వం సహకార రంగంలో 50 శాతం షేర్లు ప్రయివేట్ యాజమాన్యాలకు ఇవ్వాలని చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలన్నారు. సహకార రంగాల ఉద్యోగుల గ్రాడ్యుటి పది లక్షలకు పెంచాలని, సహకార పరపతి సంఘాలను ఇన్‌కం టాక్స్ నుంచి మినహాయించాలన్నారు. రాష్ట్రం, జిల్లాలో రైతులకు రుణాలు అందించడంలో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పంటలు సేకరించడంలో సహకార రంగ ఉద్యోగుల పాత్ర కీలకం అన్నారు. జగన్ ప్రభుత్వం సహకార రంగాన్ని ప్రయివేటీకరణ చేయడం ద్వారా రాష్ట్ర రైతాంగానికి, సహకార రంగ ఉద్యోగులకు తీవ్ర నష్టం చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో రైతుల రుణమాఫీ చేసే అవకాశం లేకుండా ప్రయివేటీకరణ చేస్తూ అసెంబ్లీలో తీర్మాణం చేయడాన్ని తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సహకార రంగాన్ని నిర్వీర్యం చేసే చట్టాలు చేస్తుంటే రాష్ట్రంలో వైసిపి, టిడిపి ఎంపిలు అందుకు మద్దతు తెలపడం రాష్ట్ర రైతాంగం చేసుకున్న దౌర్భాగ్యమన్నారు. బిజెపి విధానాలకు రాష్ట్రంలో మద్దతు తెలిపేవారిని ఓడించి సహకార రంగాన్ని కాపాడుకోవాలని రైతులకు, ఉద్యోగులకు పిలుపునిచ్చారు. సహకార రంగం ప్రయివేటీకరణ అయితే రైతుల రుణాలను రౌడీలను పెట్టి వసూలు చేసే పరిస్థితులు ఎదురవుతాయని తెలిపారు. 2019లో జారీ చేసిన ఉద్యోగుల వేతన సవరణ 36 జిఓను వైసీపీ ప్రభుత్వం నాలుగు సంవత్సరాల పాలనా కాలంలో అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సహకార సంఘాల ఉద్యోగుల డిమాండ్స్ పరిష్కరించి, సహకార సంఘాల ప్రయివేటీకరణ ఆపకపోతే రైతులను కదిలించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆటోఛార్జీ రూ.20 మాత్రమే వసూలు చేయాలి

కురుగుంట హైవేపై ప్రజల రాస్తారోకో

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కరుగుంట నుంచి అనంతపురం పట్టణంలోకి వచ్చే ఆటోలు ప్రయాణికుల నుంచి రూ.20 మాత్రమే వసూలు చేయాలని, అంతకు మించి వసూలు చేయరాదని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు బిసిఆర్.దాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం కురుగుంట వద్ద రహదారిపై స్థానికులు రాస్తారోకో నిర్వహించారు. కురుగుంట నుంచి ఆటోలో ప్రయాణించే వారి నుంచి రూ.30 చొప్పున వసూలు చేస్తున్నారని తెలిపారు. గతంలో టవర్‌క్లాక్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుండటంతో ఆటోలు చుట్టు తిప్పుకుంటూ వచ్చే క్రమంలో రూ.30 వసూలు చేశారన్నారు. ఇప్పుడు బ్రిడ్జి ప్రారంభమైనా కూడా ఆటో డ్రైవర్‌లు రూ.30 వసూలు చేస్తున్నారని ఇది సరికాదన్నారు. కాలనీల్లో రెక్కల కష్టంపై ఆధారపడి రోజూ దూర ప్రాంతాలకు ఆట్లో ప్రయాణించి పనులు చేసుకుని ఇళ్లకు వస్తుంటారని తెలిపారు. అలాంటి కార్మికులు, శ్రామికులు, ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఆటో చార్జీలు రూ.20 మాత్రమే తీసుకునేలా అధికారులు ఆటో డ్రైవర్‌లకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ నబిరసూల్ ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగయ్య, కాలనీవాసులు బాషా, ఓబుళపతి, ఈశ్వరయ్య, రామనాగేశ్వరరెడ్డి, కుళ్లాయప్ప, నాగరాజు, బాలరాజు, శంకర్ పాల్గొన్నారు.

రహదారిపై ధర్నా చేస్తున్న కురుగుంటవాసులు

ఈద్గా మైదానంలో శుభ్రత పనుల పరిశీలన

ప్రజాశక్తి-ఉరవకొండ

బక్రీద్ పర్వ దినం సందర్భంగా ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకునేందుకు ఈద్గా మైదానంలో చేపట్టిన పరిశుభ్రం పనులు చేయాలని వైసిపి మైనార్టీ విభాగం నాయకులు ఆదివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ఈద్గా అంతా పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, పంచాయతీ ఇఒ గౌస్, వైసిపి మైనార్టీ నేతలు పామిడి సలీమ్, మీరం బాషా, వడ్ల సలీం, ఆసీఫ్, అన్వర్, తాజుద్దీన్, హొన్నూరుసాబ్, శర్మస్, అయ్యార్ దాదు, జిలాన్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఈద్గాలో పరిశుభ్రత పనులను పరిశీలిస్తున్న వైసిపి నాయకులు

నేటి నుంచి 'ఉపాధి' పనులపై ఆడిట్ గ్రామసభలు

పుట్లూరు : మండలంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వతేదీ వరకూ చేసిన వివిధ పనులపై నేటి నుంచి సోషల్ ఆడిట్ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎపిఒ చెన్నకేశవులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభల అనంతరం వచ్చేనెల 3వ తేదీన మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

అనంతపురం : రోటరీ క్లబ్, రోటరీ సెంట్రల్ సహకారంతో, సక్షమ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మహిళలు 100, పురుషులు 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 78 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిలో కూడా 29 మందిని ఆదివారం రోజే ఆపరేషన్‌కు తరలించారు.

కంటి ఆపరేషన్లకు వృద్ధులను తీసుకెళ్తున్న దృశ్యం

బస్సులో ప్రయాణిస్తూ యువకుడు మృతి

గుత్తి : కర్ణాటక ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తూ ఓ యువకుడు మృతిచెందిన ఘటన ఆదివారం పట్టణ శివారులో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన మహాదేవ (25) బెంగళూరులోని ఓ ప్రయివేటు బ్యాంకులో పని చేస్తున్నాడు. అతడు అనారోగ్యానికి గురి కావడంతో స్వగ్రామానికి వెళ్లేందుకు బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళ్లే కెఎస్ ఆర్‌టిసి బస్సులో ఎక్కాడు. గుత్తి రాగానే అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన తోటి ప్రయాణికులు, బస్సు డ్రైవరు, కండక్టర్లు కలిసి యువకుడిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.